

ఈమె పేరు కోవూరు రామసుబ్బమ్మ. చెల్లాయపాళేని చెందిన ఈమె గత 12 ఏళ్లుగా షుగర్ వ్యాధితో బాధపడుతోంది. గతంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి మండల కేంద్రమైన బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లి షుగర్ పరీక్షలు చేయించుకునేది. ప్రతిసారి వైద్యపరీక్షలు, మందులకు గానూ రూ.3వేల వరకు ఖర్చు అయ్యేవి. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా వైద్యులు, నర్సులు గ్రామానికే వచ్చి ఉచితంగా షుగర్ పరీక్షలు చేస్తున్నారు. అంతే కాకుండా మంచి మందులను ఉచితంగా అందజేస్తుండడంతో ఎటువంటి డబ్బులు ఖర్చు కావడం లేదని రామసుబ్బమ్మ పేర్కొంది.



ఈయన పేరు దర్శిగుంట కర్రయ్య. రేబాల దళితవాడకు చెందిన ఈయన పక్షవాతం బారిన పడ్డాడు. మరో కాలుకు శస్త్రచికిత్స చేయించుకోవడంతో మంచంలో ఉంటున్నాడు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా ప్రతి నెలా రెండుసార్లు వైద్యులు ఇంటికి వచ్చి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేయడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. దీంతో ఆస్పత్రికి వెళ్లే బాధ తప్పిందని వృద్ధుడైన కర్రయ్య పేర్కొన్నాడు. ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.



ఈమె పేరు నన్నం కామేశ్వరమ్మ. చెల్లాయపాళేనికి చెందిన ఈమె షుగర్, బీపీతో బాధపడుతోంది. గతంలో బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోగా వైద్యపరీక్షలు, మందులకే కూలి నగదు సరిపోయేది. గత రెండు నెలలుగా ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా వైద్యులు గ్రామానికే వచ్చి వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మంచి మందులు అందజేస్తున్నారని ఆమె సంతోషం వ్యక్తం చేసింది. ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామని పేర్కొంది.

తలుపు తట్టి.. నాడి పట్టి

వైద్యో నారాయణ హరి.. వైద్యులు దైవంతో సమానం. అలాంటి వైద్యులను ఇంటి వద్దకే పంపి ఉచితంగా వైద్య సేవలతో పాటు మందులు అందిస్తోంది ప్రభుత్వం. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి నాణ్యమైన వైద్యసేవలను అందిస్తోంది. దీంతో దీర్ఘకాలిక రోగులతో పాటు గర్భిణులు, బాలింతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఇంటి వద్దకే వైద్యసేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ఫ్యామిలీ డాక్టర్ సేవల్లో భాగంగా రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచే వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆరోగ్యశ్రీ సేవలను విస్తరించారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నారు. అందులో భాగంగానే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఇంటి వద్దే వైద్యసేవలు అందిస్తుండడంతో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని రోగులు హర్షం వ్యక్తం చేశారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యసేవలు అందిస్తున్నా యి. ప్రభుత్వం గతేడాది అక్టోబర్‌లో ఫ్యామిలీ డాక్టర్ సేవలను పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రారంభించింది. ఏప్రిల్ 6న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారికంగా ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అందులో భాగంగా ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు లేదా ముగ్గురు వైద్యులను నియమించారు. పీహెచ్‌సీ వైద్యులు వారికి కేటాయించిన గ్రామాలకు నెలకు రెండు సార్లు వెళ్లి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తున్నారు. ఉదయం దీర్ఘకాలిక రోగులతో పాటు సాధారణ రోగులను పరీక్షించి మందులు అందజేస్తున్నారు. మధ్యాహ్నం ఇంటింటిని సందర్శించి మంచంలో ఉన్న రోగులు, గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు అందజేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులకు వైద్యపరీక్షలు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి పట్టణ కేంద్రాల్లోని ఆస్పత్రులకు పంపుతున్నారు. దాదాపు 67 రకాల రోగాలకు సంబంధించిన మందులు అందజేస్తున్నారు. గతంలో బీపీ, షుగర్, తదితర దీర్ఘకాలిక

దీర్ఘకాలిక రోగులకు ఉపశమనం

గతంలో బీపీ, షుగర్, తదితర వ్యాధులతో బాధపడుతున్న రోగులు ప్రతి నెలా ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకునే వారు. మందుల కోసం వేలకు వేలు ఖర్చు చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ల ద్వారా ఇంటి వద్దే వైద్యపరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు అందజేస్తుండడంతో ఆస్పత్రులకు వెళ్లే బాధ తప్పిందని దీర్ఘకాలిక రోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో రెండు నెలల్లో అందించిన వైద్య సేవల వివరాలు
పరీక్షించిన రోగులు – 8361
గర్భిణులు – 339
బాలింతలు – 240
టీబీ రోగులు – 12
కేన్సర్ రోగులు – 26
మంచానికి పరిమితమైన రోగులు – 58
షుగర్ వ్యాధిగ్రస్తులు– 3646
బీపీ వ్యాధిగ్రస్తులు–3200
సాధారణ వ్యాధులు కలిగిన రోగులు– 840

నాణ్యమైన వైద్యసేవలు



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా తనతో పాటు మరో ఇద్దరు వైద్యులు పీహెచ్‌సీ పరిధిలోని కేటాయించిన గ్రామాలకు వెళ్లి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ విధానంతో గ్రామీణులకు ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలు అందుతాయి.

– అహ్మద్‌బాబు, వైద్యాధికారి, జొన్నవాడ పీహెచ్‌సీ



104 వాహనంలో పల్లెకు వచ్చిన వైద్యులు, వైద్యసిబ్బంది

క్లుప్తంగా

శ్రీవారికి పల్లకిసేవ



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాత్రి దేవదేవేరులను విశేషంగా అలంకరించి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలను వితరణ చేశారు.

బహుమతుల ప్రదానం



కొడవలూరు: యల్లాయపాళెం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ జే సురేంద్రరెడ్డి, రిసోర్స్‌పర్సన్ వెలగపూడి రమేష్, ఉపాధ్యాయుడు పీ రంగారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



మనుబోలు: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శనివారంతో ముగిసింది. చివరి రోజు వివిధ పోటీల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు గ్రంథాలయాధికారి అరుణ్‌కుమార్ బహుమతులు అందజేశారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణా శిబిరం

ఇందుకూరుపేట: గంగపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత 40 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరం శనివారంతో ముగిసింది. వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ ముజీర్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు దిలీప్ ఆధ్వర్యంలో ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన క్రీడాకారులకు డీఎస్‌పీ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఎస్‌ఎంసీ చైర్మన్ కంసాని గోపి పాల్గొన్నారు.

దుప్పట్ల వితరణ



పొదలకూరు : మండలంలోని చిట్టేపల్లిలోని పేదలకు ఆగ్నేష్ మల్టీ పర్పస్ అండ్ డెవలపర్స్ ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. తొలుత మొక్కలు నాటి అన్నదానం చేశారు. ఆగ్నేష్ అధ్యక్షుడు ఎస్‌వీ ప్రసాద్, సభ్యులు మైఖేల్, ప్రసాద్, సురేష్, వాసు, రాకేష్, లక్ష్మణ్, కిరణ్ పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



కోవూరు(విడవలూరు): విడవలూరు మండలం రామతీర్థంలోని కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ధ్వజారోహణను వైభవంగా నిర్వహించారు. ఉదయం దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం చేశారు. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన బెజవాడ ఓబుల్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ రామకృష్ణ, చైర్మన్ నాటూరు చంద్రయ్య, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గిరిజన మహిళపై పాస్టర్ లైంగికదాడి

- శీలానికి ఖరీదు కట్టిన పెద్దలు

ఇందుకూరుపేట: గిరిజన మహిళపై ఓ పాస్టర్ లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం మేరకు... నిడిముసలికి చెందిన ఓ వ్యక్తి ముదివర్తిపాళెం చర్చిలో పాస్టర్‌గా ఉంటున్నాడు. కొంతకాలం క్రితం కాపురాన్ని నిడిముసలి నుంచి కాలవమూలకండ్రిగకు మార్చాడు. ముదివర్తిపాళేనికి చెందిన ఓ గిరిజన మహిళ భర్తతో కలిసి చేపల చెరువుల వద్ద కాపాలాగా ఉంటోంది. ఆమె ముదివర్తిపాళెం చర్చికి వెళుతుంటుంది. ఈ నెల 7న ఇంట్లో పనికి రావాలని పాస్టర్ కోరడంతో నిజమని నమ్మిన సదరు మహిళ ఆయన వెంట బైక్‌పై కాలవమూలకండ్రిగకు వచ్చింది. ఇంటికి వచ్చిన ఆమెపై పాస్టర్ లైంగికదాడికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఆమె జరిగిన విషయం భర్తకు చెప్పడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడు పలుకుబడి గలవాడు కావడంతో పెద్దలు రాజీ మార్గంగా బాధితురాలి శీలానికి రూ.40 వేలు ఖరీదు కట్టారు. న్యాయం జరగకపోగా శీలానికి వెల కట్టారంటూ బాధితురాలు ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

చంద్రబాబుకు ఒంటరిగా పోరాడే దమ్ము లేదు

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: ఎన్నికల్లో ఒంటరిగా పోరాడే దమ్ము, ధైర్యం ప్రతిపక్ష నేత చంద్రబాబుకు లేవని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గండవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు వైఖరి రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునన్నారు. ఎన్నికల సమయంలో ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకోవడం విడాకులు ఇవ్వడం ఆయనకు రివాజే నన్నారు. ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేసిన దాఖలాలు ఇప్పటి వరకు లేవన్నారు. రాష్ట్రంలోని అన్నీ పార్టీలతోనూ పొత్తులు పెట్టుకున్నారని గుర్తుచేశారు. ఇప్పుడు కొత్తగా పవన్ కళ్యాణ్‌తో సంబంధం పెట్టుకునేందుకు తహతహలాడుతున్నారని చెప్పారు. ప్రజల్లో బలం తెలియాలంటే ఒంటరిగా పోటీ చేయాలే తప్ప పొత్తులతో కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ఒంటరిగానే ఎన్నికలకు వస్తుందని స్పష్టం చేశారు. బాబు, పవన్ కళ్యాణ్ కలిసి ఎన్నికలకు వచ్చినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పాలనతో సీఎం వైఎస్ జగన్ ప్రజల మనస్సుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. ఒక్క గండవరంలోనే గడిచిన నాలుగేళ్లలో వివిధ సంక్షేమ పథకాల కింద రూ.10.08 కోట్లు అందజేసినట్లు తెలిపారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగానే సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా సంక్షేమ ఫలాలను గడప గడపకు చేరవేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రజా బలం మెండుగా ఉందన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎన్ని నాటకాలు వేసినా ప్రజలు ముక్తకంఠంతో వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, ఎంపీపీ జీ జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు అడపాల మోహనకృష్ణ, పెనాక నాగ శ్రీనివాసులురెడ్డి, ఇసనాక సునీల్‌రెడ్డి, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, ఎంపీటీసీ పెనాక శ్రీనివాసులురెడ్డి అల్లం సత్యంయాదవ్, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, ఎస్కే ముజీర్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపు



మాట్లాడుతున్న ఎస్‌ఎం చంద్రశేఖర్

కొడవలూరు: ఎన్‌సీసీలో చేరడం వల్ల దేశభక్తి, జాతీయ సమైక్యత, క్రమశిక్షణ, సేవా భావం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఎన్‌సీసీ గుంటూరు గ్రూపు కమాండర్ కల్నల్ ఎస్‌ఎం చంద్రశేఖర్ పేర్కొన్నారు. నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ వార్షిక శిక్షణా శిబిరం శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ పోటీల్లో గెలుపొందిన ఎన్‌సీసీ కేడెట్లకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ దేశానికి ఉత్తమ పౌరులను అందిస్తుందని చెప్పారు. ఎన్‌సీసీ శిక్షణ పొందిన వారు దేశాన్ని సంరక్షించే బాధ్యతను కలిగి ఉంటారన్నారు. అందువల్లే ఎన్‌సీసీ కేడెట్‌లకు సైన్యంతో పాటు వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కేడెట్లు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కేడెట్లు క్యాంప్ ఫైర్ నిర్వహించారు. లెఫ్టినెంట్ కమాండర్ వినయ్ రామచంద్రన్ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో వెంకటేశ్వర కళాశాల చైర్మన్ పెనుబలి బాబునాయుడు, ప్రిన్సిపల్ పీ కుమార్‌బాబు, 24వ ఆంధ్ర బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ సునీల్‌కుమార్, ఎన్‌సీసీ అధికారులు ఎస్కే ఖాదర్‌బాషా, గుండాల నరేంద్రబాబు, విద్యాసాగర్, మస్తానయ్య, ప్రళయ కావేరి సుష్మిత, వెంకటేష్ రాథోడ్ శివప్రసాద్, సూరజ్ బగేల్, హవల్దార్ బ్రిజ్‌పాల్ సింగ్ పాల్గొన్నారు.

అక్రమ నీటి రవాణాకు చెక్



బోరు పైపులు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ముత్తుకూరు: కృష్ణపట్నంపోర్టుకు అక్రమంగా నీళ్ల సరఫరా చేస్తున్న ట్యాంకర్లకు రెవెన్యూ అధికారులు చెక్ పెట్టారు. మండలంలోని మల్లూరు, మద్దిమాను సమీపంలో బోర్లు వేసి ఇష్టారాజ్యంగా భూగర్భ జలాలను తోడేస్తున్నారంటూ సోమవారం జగనన్నకు చెబుతాం కార్యక్రమంలో స్థానికులు ఫిర్యాదు చేశారు. సుమారు 50కు పైగా ట్యాంకర్లు నీటిని తోడేయడం వల్ల భూగర్భ జల మట్టం పడిపోతోందని విన్నవించడంతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టారు. ఐదుగురు వ్యక్తులు 20 పాయింట్లు వేసి భూగర్భ జలాలను ట్యాంకర్ల ద్వారా రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. నీళ్ల రవాణా అనుమతులు చూపించాలని ట్యాంకర్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. అయితే ఎవ్వరూ స్పందించకపోవడంతో విద్యుత్ ఫీజులు, పైపులు, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. గతంలో జిల్లా కలెక్టర్ రెండు పాయింట్లకు మాత్రమే అనుమతి ఇచ్చారని ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసులు శనివారం చెప్పారు. పోర్టులో తాగునీటి అవసరాల దృష్ట్యా నీళ్ల సంగ్రహించేందుకు ఈ రెండు పాయింట్లకు మాత్రం అనుమతి ఇచ్చామని వెల్లడించారు.

స్త్రీ విద్యకు జీవితం అర్పించిన పొణకా



కనకమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి

ఇందుకూరుపేట: స్వాతంత్ర సమరయోధురాలు, గాంధీ ఆశ్రమ స్థల దాత పొణకా కనకమ్మ స్త్రీ విద్య కోసం తన జీవితాన్నే అర్పించిన మహోన్నత వ్యక్తి అని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కొనియాడారు. మండలంలోని పల్లిపాడు పినాకిని సత్యగ్రహ గాంధీ ఆశ్రమంలో పొణకా కనకమ్మ 132వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పొణకా కనకమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. దాతల ద్వారా సుమారు రూ.45 లక్షలు సేకరించి గాంధీ ఆశ్రమంలోని డీ అడిక్షన్ సెంటర్‌ను పునరుద్ధరించి వృద్ధాశ్రమంగా మారుస్తామని తెలిపారు. అనంతరం ప్రతి ఏటా అందించే పొణకా కనకమ్మ పురస్కారాన్ని పల్లిపాడు ఎంపీపీ స్కూల్ టీచర్ సీహెచ్ రేవతికి ప్రదానం చేశారు. తొలుత గాంధీ, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు సమర్పించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా ఆశ్రమ కమిటీ సభ్యులు కందికట్టు రాజేశ్వరి వృద్ధాశ్రమ నిర్మాణానికి రూ.3 లక్షలు విరాళంగా అందజేశారు. ఆశ్రమ కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు గణేశం సుమంత్‌రెడ్డి, జీవీ రామిరెడ్డి, ఆశ్రమ కమిటీ సభ్యులు షేక్ అల్లాబక్షు, సర్పంచ్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మహాకుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం



ముత్తుకూరు: కృష్ణపట్నంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి(విష్ణాలయం) ఆలయంలో మహాకుంభాభిషేక మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. మరో వైపు రుత్వికుల యాగాల నిమిత్తం హోమశాలను ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ నిర్వాహకులు సకల సౌకర్యాలు కల్పించారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



కొడవలూరు: సీతారాముల కల్యాణోత్సవం



మనుబోలు: విగ్రహ ప్రతిష్ట చేస్తున్న వేదపండితులు

కొడవలూరు: మండలంలోని నాయుడుపాళెంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్టను శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం యంత్ర స్థాపన, శిఖర కలశ స్థాపన, విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, కుంభ దర్శనం, సర్వదర్శనం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సీతారాముల శాంతి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ నిర్మాణ దాతలు మారంరెడ్డి నారసింహారెడ్డి, సుజాతమ్మ, శేషురెడ్డి, వర్షిణి, విష్ణుప్రియ పాల్గొన్నారు.

మనుబోలు: మండలంలోని లక్ష్మీనరసింహపురంలో టీటీడీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన రామమందిరంలో సీతారాముల విగ్రహ ప్రతిష్టను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ నెల 8న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయాన్ని ప్రారంభించారు. అనంతరం మూడ్రోజుల పాటు వేదపండితుల ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. చివరిరోజు సీతారాముల విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు ఉప్పలపాటి రామసుబ్బానాయుడు, జగదీష్‌నాయుడు, సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ ఆలూరు రాము, జిల్లా సభ్యులు గిరిజమ్మ, రమణయ్య, గణపతి, రాము, తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి దాతలు దొడ్ల కోదండ రామిరెడ్డి శనివారం ఆరు కుర్చీలను వితరణ చేశారు. వైద్యసిబ్బంది కూర్చునేందుకు అవసరమైన కుర్చీలను వితరణ చేసిన దాతకు వైద్యులు వెంకటలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు కొండయ్య, సుమన్ పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

కోవూరు: పోలీసు సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై దాసరి వెంటేశ్వరరావు అన్నారు. కోవూరు పోలీసు స్టేషన్‌లో పోలీసు సిబ్బందితో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా స్టేషన్‌కు కొత్తగా వచ్చిన సిబ్బంది, పాత సిబ్బంది సమష్టిగా నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపై స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సై రమ్య, ఏఎస్సైలు,తదితరులు పాల్గొన్నారు.